క్లుప్తంగా

రేపు మండల మీట్

గుర్రంకొండ: మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశులు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ ఆధ్వర్యంలో మండల మీట్ నిర్వహిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

41 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 41 మంది హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పరివర్తన్ ఎడ్యుకేషనల్ క్రైసిస్ సపోర్టు స్కాలర్‌షిప్పులు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. ముగ్గురు ఎంబీఏ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.75 వేలు, 37 మంది ఎంసీఏ విద్యార్థులకు రూ.35 వేలు చొప్పున ఒక బీటెక్ విద్యార్థికి రూ.50 వేలు చొప్పున స్కాలర్‌షిప్పులు మంజూరైనట్లు తెలిపారు. మెరిట్ ఆధారంగా ఈ స్కాలర్‌షిప్పులు వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు వేలల్లో స్కాలర్‌షిప్పులు మంజూరు కావడంతో కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి హర్షం వ్యక్తం చేశారు.

హాకీ క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా హాకీ జూనియర్ బాలుర జట్టుకు శనివారం స్థానిక బీటీ కాలేజీ మైదానంలో టీ షర్టులు పంపిణీ చేశారు. ది అన్నమయ్య హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఆదివారం నుంచి జరిగే అంతర్ జిల్లా హాకీ పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా నుంచి 16 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో కోచ్ నౌషాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతీ వడ్డిపల్లిలో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం కలశ స్థాపన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన గజ్జల శ్రీనివాసులు అనే భక్తుడు వారి కన్నవాళ్ల జ్ఞాపకార్థం ఆలయంలో అభిషేకాలతో పాటు ఆదివారం ఉత్సవ మూర్తుల విగ్రహ ప్రాణ ప్రతిష్ట, సీతారాముల కల్యాణంతో పాటు భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించినట్లు ఆలయ ధర్మకర్త ఆదిమూర్తి, గ్రామస్థులు పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి తీవ్రగాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో భవననిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. చంద్రాకాలనీలో నివాసం ఉంటున్న గంగాద్రి (50) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం పనులకు వెళ్లి, పొద్దుపోయాక ఇంటికి వస్తుండగా నీరుగట్టువారిపల్లె సమీపంలోని స్పీడ్‌బ్రేకర్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి కిందపడి గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉడ్ బాల్ పోటీలో ప్రతిభ



షీల్డుతో విద్యార్థి, అధ్యాపకులు

బి.కొత్తకోట : మహారాష్ట్రలోని నాగపూర్‌లో నిర్వహించిన ఉడ్ బాల్ జాతీయ స్థాయి సీనియర్స్, జూనియర్స్ విభాగంలో స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్.మేఘన సింగిల్స్ విభాగంలో మొదటి స్థానం, జట్టు విభాగంలో రన్నరప్‌గా నిలిచినట్లు ప్రిన్సిపల్ ప్రసాద్ శనివారం తెలిపారు. ఈ పోటీల్లో 28 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. మేఘన పాల్గొని విజేతగా నిలిచి షీల్డ్ అందు కున్నారని తెలిపారు.

పరీక్షలు ముగిసినా ఇవ్వని ట్యాబ్‌లు

పెద్దతిప్పసముద్రం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ట్యాబ్‌లను ఉచితంగా అందజేసింది. విద్యార్థుల భవిష్యత్ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 8 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ తరుణంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు బాగా రాయాలని ట్యాబ్‌లు వారి వద్ద ఉంటే చదువుపై శ్రద్ధ చూపరనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు పిల్లల నుంచి ట్యాబ్‌ల తీసుకున్నారు. ఇంత వరకూ బాగానే ఉన్నా పబ్లిక్ పరీక్షలు పూర్తయినా కూడా ఇంత వరకు విద్యార్థులకు ట్యాబ్‌లను ఎందుకు తిరిగి ఇవ్వలేదో అయ్యవార్లకే ఎరుక. పిల్లల నుంచి ట్యాబ్‌లను వెనక్కి తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎటువంటి ఆదేశాలు లేదు. ఒకవేళ తీసుకున్నా వెంటనే తిరిగి పిల్లలకే ఇచ్చేయాలని డీఈఓ ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు సమగ్రమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే మండలంలోని పలు జెడ్పీ హైస్కూళ్లలో మాత్రం ట్యాబ్‌లను ఇవ్వకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండి పడుతున్నారు.

జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

మదనపల్లె : స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త, సామాజిక న్యాయం కోసం పోరాడిన బాబు జగ్జీవన్‌రామ్ జీవితం, సందేశాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు. దళిత సమాజ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ఉన్నతమైనదని వెల్లడించారు. శనివారం భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం, మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏఓ రాఘవేంద్రరావు, రెవెన్యూ సిబ్బంది జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల కోసం బాబూ జగ్జీవన్‌రామ్ పోరాటం చేశారని కొనియాడారు. మాలమహానాడు కార్యాలయంలో దళితుల ఆశాజ్యోతి ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలాసుదర్శనం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, దళితుల కోసం జగ్జీవన్‌రామ్ చేసిన త్యాగాలను గుర్తుచేసుకున్నారు. బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక బేబీవెల్‌కం హోమ్‌లో నాయకులు జన్నే రాజేంద్రనాయుడు, పాదలనరసింహులు, సుబ్రహ్మణ్యం, కట్టాగంగులప్ప, మౌలాలి, కృష్ణమూర్తి, చెన్నంశ్రీరాములు తదితరులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ సర్వతోముఖాభివృద్ధికి ఆయన అందించిన సేవలు ఎనలేనివని ప్రశంసించారు. బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు అధ్యక్షతన, జిల్లా నాయకులు రాఘవేంద్రయాదవ్ ఆధ్వర్యంలో ఆటోస్టాండ్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బడుగువర్గాల అభ్యున్నతి కోసం, సమసమాజ స్థాపన కోసం జగ్జీవన్‌రామ్ విశేష కృషి చేశారన్నారు. దళితుల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ ఎనలేని కృషిచేశారని ఉద్ఘాటించారు. ఆయన సాధన కోసం ప్రతి ఒక్కరం కృషిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొమ్ముహరిబాబు, మూడే రూపక్‌నాయక్, వర్ల భానుప్రకాష్, నవీన్‌రాయల్, వాజిద్, గురుమూర్తి తదితరులు ఉన్నారు.



బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులు



బహుజనసేన ఆధ్వర్యంలో నివాళులు

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని నిమ్మనపల్లెలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం పెద్దమాదిగపల్లె వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతిగా బాబూ జగ్జీవన్‌రామ్ పనిచేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమనేతగా, భారత ఉపప్రధానిగా ఆదర్శవంతంగా జీవించారన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు రెడ్డినారాయణ, రెడ్డిప్రసాద్, నాయకులు మల్లేశ్వరరావు, హరిబాబు, రెడ్డెప్ప, శిధర్, రాజశేఖర్, శేషు, భాను, శ్రీనివాసులు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరాధ్య దైవం బాబు జగ్జీవన్‌రామ్

పీలేరు : పేదల ఆరాధ్యదైవం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని వివిధ సంఘాల నాయకులు అన్నారు. శనివారం ఎమ్మార్పీస్, బాస్ కార్యాలయం, ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ చిన్నతనంలోనే సమాజం పట్ల ఆకర్షితుడైన ఆయన సామాజిక వివక్షితను రూపుమాపడానికి దృఢమైన పునాదులు వేశారన్నారు. దళితుల కుటుంబంలో పుట్టిన ఆయన దళితుల అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, వివిధ సంఘాల నాయకులు ధరణికుమార్, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి

కేవీపల్లె : బడుగుల బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని ప్రజా సంఘాల నాయకులు ముల్లంగి చంద్రయ్య అన్నారు. శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని స్థానిక ఎస్సీ హాస్టల్ వద్ద ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి చేశారని పేర్కొన్నారు. సామాజిక న్యాయ సాధనకు పాటుపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున, విశ్వనాథ్, శేషాద్రి, బాలకృష్ణ, చంద్ర, నాగేశ్వర తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్, ఎంసీపీ ఆధ్వర్యంలో కేవీపల్లెలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు స్ఫూర్తి

బి.కొత్తకోట : డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాలకు స్ఫూర్తి అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము వెంకటేశ్వర్లు చిన్న, బాస్ జిల్లా కార్యదర్శి సచిన్ అన్నారు. శనివారం బి.కొత్తకోటలో అయన జయంతి వేడుకలను ఎమ్మార్పీఎస్, బాస్ వేర్వేరుగా జగ్జీవన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. సుదీర్ఘ కాలం ప్రజా ప్రతినిధిగా, కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అణగారిన వర్గాల అభివద్ధి కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమాల్లో నాయకులు పలక రవి, చౌడప్ప, రఘు, వెంకటప్ప, సింగన్న, కొగర మాధవ, యు. వెంకటేష్, జెకె శ్రీనివాసులు, సొట్ట రమేష్, మనోహర్, మోహన్, శ్రీనాథ్, కష్టారెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, సొట్ట గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

తంబళ్లపల్లె: సమసమాజ స్థాపనకు అలుపెరగని పోరాటం చేసిన మహానీయుడిగా జగ్జీవన్‌రామ్ అందరికి ఆదర్శమని ఎంఆర్‌పిఎస్ నాయకులు మల్లికార్జున, ఫోర్డు సంస్థ ప్రతినిధి నరసింహులు అన్నారు. శనివారం హరిత సర్కిల్‌లో జగ్జవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ గోపిదిన్నె మల్లికార్జున, ఎరుకల సంఘం నాయకులు రఘుపతి పాల్గొన్నారు.



పీలేరు ఎమ్మార్పీస్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి



బి.కొత్తకోట : జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులు









మాలమహానాడు కార్యాలయంలో..., నిమ్మనపల్లె : నివాళులు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు, కేవీపల్లెలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం , తంబళ్లపల్లె: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

వైఎస్సార్ సీపీ బలోపేతంపై దృష్టి సారించండి

- కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి
- జగనన్న సంక్షేమ పాలనకు, బాబు పాలనకు తేడాను తెలపండి
- కష్టకాలంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ మేలు చేస్తాం



నిసార్‌అహ్మద్ దంపతులను సన్మానిస్తున్న అనుబంధ విభాగాల కమిటీ అధ్యక్షులు

మదనపల్లె : నియోజకవర్గంలో క్షేత్రస్థాయి నుంచి వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ చెప్పారు. మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నూతనంగా ప్రకటించిన మదనపల్లె మున్సిపల్, మండల, నిమ్మనపల్లె, రామసముద్రం మండల అనుబంధవిభాగాల అధ్యక్షులు శనివారం నిసార్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు, పదవులు కేటాయించినందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, సమన్వయకర్త నిసార్‌అహ్మద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ పదవులు పొందిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి ఆశయసాధనకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని తెలిపారు. పేదల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఆయనకు విశేష స్పందన లభిస్తోందన్నారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఓటమిని చవిచూసినప్పటికీ, మాజీ సీఎం జగన్‌కు ఎనలేని ప్రజామద్దతు ఉందని స్పష్టం చేశారు. అందుకే పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సూపర్‌సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమిప్రభుత్వం పది నెలల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు నిలుపుకోలేక పోయిందన్నారు. ప్రజాక్షేత్రంలో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. ప్రజలంతా అసంతృప్తితో, అధికారపార్టీపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఇలాంటి సమయంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు..ప్రజాసమస్యలపై దృష్టిపెట్టి, కూటమిప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి పనిచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలనలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం జగనన్న నెరవేర్చిన హామీలను గుర్తుచేయడంతో పాటుగా, చంద్రబాబు నమ్మక ద్రోహాన్ని ప్రజలకు వివరించాలన్నారు. రానున్న స్థానికసంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. ఎవరైతే కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటారో, వారందరికీ మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. నిసార్‌అహ్మద్‌ను కలిసిన వారిలో నాయకులు కొత్తపల్లె మహేష్, ఎం.డి. ముజీబుద్దీన్, మల్లికార్జునరెడ్డి, జయంతి, ఏ.వి. అపర్ణ, రవితేజ, దామోదర్ కొర్లకుంట, వి.శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్ తదితరులు ఉన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా

-డీఎస్పీ కొండయ్యనాయుడు



దుకాణదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె: అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచామని డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. శనివారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని కదిరిరోడ్డు, మరికొన్ని ప్రాంతాల్లో సీఐ ఎరిసావల్లి, పోలీసు సిబ్బందితో కలిసి డీఎస్పీ దుకాణాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కదిరిరోడ్డులో ఉన్న మద్యం దుకాణం వద్ద బహిరంగ మద్యం పానం చేస్తున్నవారిని గుర్తించి ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసినా చర్యలు తప్పవన్నారు. నిషేధిత పదార్థాలైన గుట్కా, హాన్స్, ఖైనీలు విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. దుకాణ యజమానులు తప్పనిసరిగా సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డబ్బులకు ఆశపడి ఎవరైనా మద్యం, గంజాయి అక్రమ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. దుకాణదారులకు స్థానిక యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర నియంత్రణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాలతో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు శివకుమార్, అన్సర్‌బాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష పుష్పార్చన



లక్షపుష్పార్చన కార్యక్రమంలో మహిళలు

మదనపల్లె సిటీ: స్థానిక ఆర్యవైశ్య హాస్టల్లో శనివారం సాయంత్రం లక్ష పుష్పార్చన కార్యక్రమం కనుల పండవగా జరిగింది. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. వైశ్యకుల గురువు శ్రీశ్రీ వామనాశ్రమస్వామీజీ ఆధ్వర్యంలో 102 జంటలతో శ్రీ వాసవి అమ్మవారికి లక్షపుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల పూలతో అమ్మవారికి పుష్పార్చన చేశారు. చంద్రమౌళీశ్వర ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. వామనాశ్రమస్వామిజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్, దేవతా సతీస్, గిరిధర్, పసుపు రవి తదితరులు పాల్గొన్నారు.

సెలవురోజుల్లో పాఠశాలలు నిర్వహించడంపై నిరసన

మదనపల్లె సిటీ: ప్రభుత్వ సెలవు దినాల్లో మదనపల్లెలోని కార్పొరేట్ పాఠశాలు పాఠశాలు నిర్వహించడంపై శనివారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని నారాయణ స్కూల్ వద్ద ఆందోళన చేశారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని సెలవు ప్రకటించినా పాఠశాలలు నడపుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ తెలిపారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు అఫ్రేద్, సభ్యులు జయబాబు, సమీర్, ప్రేమ్,బన్నీ తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బందికి సన్మానం



108 సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్‌ఐ, తదితరులు

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో 108 సిబ్బందిని ఘనంగా సన్మానించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రీడో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సిబ్బందికి సన్మాన పత్రం, దుశ్శాలువ, పూలమాలలతో పాటు దుస్తులను అందజేశారు. అనంతరం ఎస్‌ఐ మధురామచంద్రుడు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో డ్రైవర్లదే కీలక పాత్ర అన్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ప్రజలను ఆదుకొనే విషయంలో 108 సిబ్బంది మొదటి స్థానంలో నిలుస్తారన్నారు. 24 గంటలు తమ వృత్తిలో నిమగ్నమై సేవా కార్యాక్రమాల్లో పాల్గొంటుండడం అభినందనీయమన్నారు. ఇలాంటి వారిని గౌరవించి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రవీంద్రనాయక్, రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య, సర్పంచ్ ఎల్లుట్ల మురళి, వీఆర్వో సదాశివ, నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రమణ పాల్గొన్నారు.

చలి వేంద్రం ప్రారంభం

కురబలకోట: అంగళ్లులో జన సేన పార్టీ నాయకుడు శెట్టి రాజేష్ ఆధ్వర్యంలో శనివారం చలి వేంద్రం ప్రారంభించారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్ దీనిని ప్రారంభించారు. వేసవిలో బాటసారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మధుసూధన్

మదనపల్లె సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన ఏపీ జేఏసీ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహారెడ్డి, పోకల మధుసూధన్ తెలిపారు. శనివారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో డివిజన్ జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. సుమారు 32 ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్లు, కార్మిక సమస్యలపై ప్రాతినిధ్యం చేస్తూ, సమస్యల సాధనకై నిరంతరం కృషి చేస్తామన్నారు. అవసరమైతే పోరాటాలు చేయడానికి సిద్ధమన్నారు. కోశాధికారిగా రెడ్డిశేఖర్, కో చైర్మన్‌గా రవిప్రకాష్, విజయ్‌కుమార్, నరసింహులు, విజయకుమార్‌రెడ్డి, గిరిధర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా హేమలత, అశోక్, రామచందారెడ్డి, రమాదేవి, సుధాకర్, మోహన్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, శేఖర్‌రెడ్డి,గిరివర్ధన్‌నాయుడు, చిన్నప్ప, గాలి రవీంద్ర, విద్యాధరరావు, రవినాయక్, మోహన్, నాగరాజ, ఆనందరెడ్డి, వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మహాబోధివిహార బౌద్ధులకే అప్పగించాలి

– బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్రసాద్



మాట్లాడుతున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె : మహాబోధి, మహావిహారం అని పిలువబడే, బోద్ గయా ఆలయాన్ని పూర్తి స్థాయిలో బౌద్ధులకే అప్పగించాలని, ప్రస్తుతం కొనసాగుతున్న బోద్ గయ ఆలయ నిర్వహణ కమిటీ (బి.టి.ఎం.సి) వెంటనే రద్దు చేయాలని భారతీయ అంబేద్కర్ సేన (బాస్) వ్యవస్థాపకులు పీటీయం.శివప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని న్యూ అంబేడ్కర్ సర్కిల్ వద్ద భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో సామ్రాట్ అశోక – డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సామ్రాట్ అశోక, బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటాలను ఏర్పాటు చేసి, పూలతో అభిషేకించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ అశోకుని పాలనాకాలం దేశానికి స్వర్ణయుగమన్నారు. ఆయన పాలనలో మనుషులకు, పశువులకు కూడా ఆస్పత్రులను ఏర్పాటు చేశారని, విద్యాలయాలను విరివిగా నిర్మించారాని చెప్పారు. ఔషధ షాపులు (మెడికల్ స్టోర్స్) ఇరవై నాలుగు గంటలు పనిచేసే విధానం అశోకుడే ప్రారంభించాడని చెప్పారు. సామ్రాట్ అశోకుడు బోద్ గయలో బుద్ధుడు జ్ఞానోదయం పొందిన ప్రదేశంలో మహావిహారాన్ని నిర్మించారని, యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా దీన్ని గుర్తించిందన్నారు. బోద్ గయ ఆలయ నిర్వహణలో బ్రాహ్మణుల ప్రమేయాన్ని తొలగించి, ఆలయాన్ని పూర్తి స్థాయిలో బౌద్ధులకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నుద్దేశించి మాట్లాడుతూ దివంగత ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గొప్ప రాజకీయ దక్షితుడుగా బహుముఖ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ డి.జి. రామ్మూర్తి, బాస్ రాష్ట్ర అధికార ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, డాక్టర్ గంగాద్రి, అంజనప్ప, చిన్నప్ప లతోపాటు స్థానిక బాస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు

మదనపల్లె సిటీ: శ్రీరామనవమి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం సామూహిక కన్యాపాశుపథ స్వయంవర పార్వతీ మూలమంత్ర హోమాలు నిర్వహించారు. సాయంత్రం వరపూజ, నిశ్చితార్థం కార్యక్రమాలు చేశారు. స్థానిక సొసైటీకాలనీలోని రామాలయంలో ఉదయం ధ్వజారోహణం,హోమాలు చేశారు. సాయంత్రం స్వామిని హనుమంత వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు.

సీతారాముల ఆలయ ప్రతిష్ట అంకుర్పారణ: మదనపల్లె మండలం సీటీఎం క్రాస్‌రోడ్డు గ్రామ పంచాయతీ ఇందిరమ్మకాలనీలో సీతారాముల స్వామి ఆలయ ప్రతిష్ఠకు అంకుర్పారణ చేశారు. కలశస్థాపన, వేద పండితులు వాస్తు,నవగ్రహ, విష్ణు హోమాలు నిర్వహించారు. ఆదివారం హనుమంత లక్ష్మణ సీతా సమేత రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేకం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు ఈశ్వరమ్మ, బండపల్లి అక్కులప్ప పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు రూరల్ : పట్టణంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం స్థానిక సదుం మార్గంలో శ్రీ కల్యాణ సీతారామస్వామి వారి ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. స్థానిక వినాయకస్వామి ఆలయం నుంచి సదుం మార్గంలోని రామాలయం వరకు జలం మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. సీతారాములవారికి వారికి ఘనంగా జలాభిషేకం చేపట్టారు. అనంతరం ధ్వజారోహణం, గణపతి హోమంతో ఉత్సవాలు ప్రారంభించారు. అలాగే కోదండరామస్వామి ఆలయంలోనూ స్వామివారికి జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 7 గంటలకు శ్రీరామనవమి శోభాయాత్ర బైక్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం, అన్నదానం కార్యక్రమం ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.